కవితా కౌముది

# నాయనమ్మ - తాత

వడ్లకొండ దయాకర్

కాలం చెక్కిన బొమ్మ
మా నాయినమ్మ..
ఎన్నెల ఊసుల పూత
మా తాత.

కోటి ఆసెల దీపం
ఒకరైతే
మానవత్వపు రూపం
మరొకరు.

ఇల్లు ఇరుకే
ఆళ్ళ మనసే యిశాలం.

అలికిన నేలపై
గీసిన ముగ్గులాళ్ళు
గుడ్డి దీపం ఎల్గులు
కొలువైన ఆది దంపతులాళ్ళు.

ఆళ్ళ పెయ్యిపైనున్నయి
ముడ్తలనుకుంటె పొరపాటే
అయ్యి అన్భవాల ఆనవాళ్ళు.

సరం బట్టి ఏడ్శే పోరల
ఊకుంచడం ఆళ్ళకు దెల్సినట్టు
మరెవ్వలకు తెల్వదు.

'దూం' శేసే పోరల
'గావురం' జేయడం
ఆళ్ళకు 'ఎన్నతో పెట్టిన యిద్దె'

ఆళ్ళ కథలింటె
'ఊఁ' కొట్టాలె,
ఆళ్ళ పాటలింటె
నిద్ర బట్టాల్సిందే..

ఆళ్ళ మొఖంల
'చిర్నవ్వు' శెదరడం
నేనైతె సూడలె.

కానీ.. ఇది ఎన్కటి ముచ్చట!
ఆళ్ళ మొఖంల
నవ్వు సచ్చిపొయ్యింది.!
ఇన్నాళ్ళు 'అండ'గా నిల్సినోళ్ళు
'గుదిబండ'లయ్యిండ్లు
'గావురం' జేసినోళ్ళు
'భార'మైపోయిండ్లు!
'ముచ్చట్లు' కరువై
పశ్నలు మొదలై
అన్నున్నా 'అనాథ'లై...
యింట్లనుండి
బల్వంతాన ఈదిలకు
గాదే.. 'వృద్ధాశ్రమాలకు'
నెట్టేయబడ్డారు.
ఐనా..
ఆళ్ళది శెద్రని 'యిశ్వాసం'.
తర్గని 'ఔదార్యం'
కాలం శెల్లిన బొమ్మ
మా నాయినమ్మ!
ఎన్నెల బాసిన జాబిలి
మా తాత!'

★★★

# నదీ — ఆమె

పాతూరి అన్నపూర్ణ



నదీ అలలు వేరుకాదు
కష్టసుఖాలు అలల్లా
ఆమెకు చర్విత చరణాలు
లేకుంటే
ఇంతకాలం సృష్టి మనదేమో?
చరిత్ర కొత్తగా లిఖిత మౌతూనే వుంది
పరిహాసాలు ,పతనాలు
యవ్వనాలను కాటేస్తూనే వున్నాయి
కీచక పర్వాలను చూసినప్పుడు
నిర్భయచట్టం నిద్ర లేస్తుంది !
చూసీ చూడనట్లు
మళ్ళీ దుప్పటి కప్పుకుంటుంది
చిన్నారి తల్లుల కన్నీళ్ళతో
కాముకత దాహం తీర్చుకుంటున్నది
రోజులను నీడల్లోకి నెట్టేస్తూ
ఒళ్ళు విరుచుకున్న రాక్షస క్రీడలకు
కొన్ని పూలు రాలిపోతున్నాయి
కొన్ని మధు పాత్రలు విషంలా మారుతున్నాయి!
అయినా నదీ ప్రవాహం ఆగదు
ప్రక్షాళనం అవుతూనే వుంటుంది
మరింత వుధృత మౌతుంది
నవ మాసాలు భారాన్ని మోస్తూ
పునర్జన్మతో తల్లిలా మారుతుంది
తన జాతి బలపడడానికి
తుఫానులను సైతం ఎదుర్కునే
అలలుగా తయారు చేస్తుంది
చూద్దాం !
ఆ శక్తికి
శిలలు ముక్కలవుతాయేమో!
మళ్ళీ కాళికలు అవతరిస్తారేమో !!

★★★



# దీపం

కృష్ణమణి

నింగిలోంచి
భూమికి దగ్గరగా వచ్చినప్పుడు తెలిసింది
ఎంత అందంగా ఉందోనని !

అన్ని గ్రహాలు ఉన్నట్లు గుండ్రంగా ఉన్నా
ఆ అందాల ప్రక్రుతి హొయలు
మనసుని కట్టిపడేసింది

తెల్లని మబ్బుల ఊయలలు
దోలాయమానం అంటే ఏంటో రుచి చూపించాయి

అ నీలి సంద్రం మధ్యలో పచ్చటి మైదానపు ప్రదేశాలు
అక్కడక్కడ గోదుమరంగు ఇసుక ప్రాంతాలు
కన్నుల పండుగనే చెప్పాలి

మబ్బుల్ని దాటి భూమిపైకి వస్తుంటే
ఏవో రేకుడబ్బాలు చువ్వలు దాడి చేసాయి
భూమికి రక్షణగా
ఎదో శక్తి ఇలా చేస్తుందని అనుకున్నాను

మొత్తానికి వాటినుండి తప్పించుకొని
ఒక చక్కని పచ్చని ప్రాంతంలో దిగి
అక్కడి ప్రాణుల్ని గమనించాను
ఒక ప్రాణిపై మరో ప్రాణి ఆధారపడి బతుకుతున్నాయని
బతకడానికి ఎదుటి ప్రాణిని చంపుకు తింటున్నాయని
ఆకును పండును కాయను తినే సాత్విక జీవులు కొన్నైతే
రక్తమాంసాలకై కోరలు గోర్లతో క్రూరంగా ఉన్న జీవులు

బయటికి కనిపించే రంగురంగుల పక్షులకు
ఎగిరిగంతులేసే అమాయక జంతువులకు
కిచ్ కిచ్మనే చిట్టిపొట్టి పురుగులకు
జీవన్మరణ పోరాటమే నిత్యం
ఆధిపత్య కృరత్వం వల్ల

ఆధిపత్యమంటే ఎవరిదని చూస్తే తెలిసింది
మనిషనే ప్రమాదకర విష జంతువుదని

తెలివి పెంచుకొని అడవిని అలికి
అందమైన కోటలను
పేక మేడలను కట్టి
ఆకాశానికి విషపుగోట్టాన్ని తగిలించి
తానూ చెడింది కాక
లోకాన్ని చెరుస్తున్నాడీ మూర్ఖుడు

వాడికి వాడే పోటి పడి
భూమికి గీతాలు గీసి
పంచుకొని యుద్ధాలు చేస్తున్నాడు
ప్రకృతిని చిదిమి దీపం పెట్టుకుంటున్నాడు
సకల జీవాలకూ పెడుతున్నాడు

కోపం తట్టుకోలేక శపించాను
ఒక్క క్షణంలో ఈ మనిషి వెయ్యి ముక్కలవ్వుగాక అని
వెంటనే పెద్ద శబ్దంతో ఒక విస్పోటనం

ఉలిక్కిపడి లేచాను నిద్రలోంచి
నాపై నేనే సిగ్గుపడుతూ..!

★★★★



# ఏకాంత జ్వాలలు

మూలా వీరేశ్వరరావు

లెక్కల్లో  చిక్కు కున్న
కలలన్ని కొమ్మల్లో
ఇరుక్కున్న పతంగాలైనప్పుడు
రెక్కలు తెగిన విహంగాలై
జీవన ఎడారి లో మృగ తృష్ణ లైనప్పుడు
ఎప్పుడు మొదలైన దో
తెలియని కథలో
ఎప్పటికి తెలియని మలుపుల్లో
జీవితం తిరుగు తున్నప్పుడు
నీకు నాకు మధ్య బంధాన్ని
కొలిచే ఆర్థిక సూత్రాలు
ఎటు తిప్పాయో !!
అన్ని బంధాలు
నిర్బంధాలై
అన్ని సత్యాలు
అర్ధ సత్యాలై నప్పుడు
గాయ పడ్డ ఏకాంతాలన్ని
జ్ఞాపకాల జ్వాల లే !

****







# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఘడియలు జీవితమ్మున గడచెనెన్నొ
కొన్ని యానందమయముల్లై గుండె నిండె
క్లేశభరితమ్ములై కొన్ని లిప్తలుండె
ఎటులనో సాగె జీవితమింత వరకు

సరిగనేదియు నిల్వదు జగతి యందు
అన్నియునెగుడు దిగుడులే యగుచునుండు
పట్టి తీర్చి దిద్దుచునుందు ప్రతిదినమ్ము
కలుగు మోదమ్మునకు కాపు కాచుచుందు

కలుగు సంతృప్తి యున్నది క్రమమునందొ
క్రమము తప్పక కాచెడు శ్రమమునందొ
కలత లేమియే యానంద కారణమ్మొ
కలత లేకున్న ముదమన్న తెలియమేమొ

కలసి నీతోడ బ్రతుకెల్ల గడపనెంతు
కష్టసుఖములిరువురము కలసి పొంద
కాలమంత యొకే రీతి గడచునన్న
ఏది సంతృప్తి యేదసంతృప్తి యగును?

ఎన్నడును నను వీడి యేగవన్న
తలపు నాకెంతొ యానంద దాయకమ్ము
సృష్టిలో యెడబాటు లేదేని యెపుడు
ఏ విధమ్ముగనుండునో యీ ముదమ్ము



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS